

నారాయణమ్మ కాలేజీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో రాష్ట్రపతికి మెమెంటో అందజేస్తున్న నిర్వాహకులు



ముచ్చింతల్‌లో ముర్ము, చిన జీయర్‌స్వామి, తమిళిసై

## జాబ్స్ చేయడం కాదు.. ఇచ్చే స్థాయికి

# మహిళలు ఎదగాలి

## ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము పిలుపు

- ఆత్మవిశ్వాసంతో లక్ష్యాన్ని సాధించాలి
- మహిళలు ముందుకెళ్తేనే దేశం ముందుకు
- మారుమూల ప్రాంతాల్లోని పేదలకూ టెక్నాలజీ సాయం అందాలని సూచన
- జి. నారాయణమ్మ కాలేజీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమానికి హాజరు

**హైదరాబాద్, వెలుగు:**

దేశంలో ఇప్పటికీ మహిళలు కొంత వెనుకబడే ఉన్నారని, ఇంటి పనులు చూసుకుంటూ అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోతున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అన్ని రంగాల్లోనూ మగవారికి సమానంగా మహిళలు ముందుకెళ్తేనే దేశమూ ముందుకెళ్తుందని చెప్పారు. అన్ని రంగాల్లో మహిళల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని సూచించారు. గురువారం జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ సిల్వర్ జూబ్లీ కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. స్టూడెంట్లతో ఇంటరాక్ట్ అయ్యారు. గోల్డ్ మెడల్స్ సాధిస్తున్న వారిలో ఎక్కువ మంది అమ్మాయిలే ఉంటున్నారని, ముందుకెళ్లాలన్న వారి తపన అద్భుతమని ముర్ము కొనియాడారు. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్)లో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉందని, వాటిలోనూ మహిళలు రాణించాల్సిన అవసరం ఉందని ప్రెసిడెంట్ అన్నారు. ఉద్యోగాలు చేయడం కోసం కాకుండా ఉద్యోగాలిచ్చే పొజిషన్‌కు అమ్మాయిలు ఎదగాలని పిలుపునిచ్చారు. అనుకున్న లక్ష్యాన్ని ఆత్మవిశ్వాసంతో సాధించాలని సూచించారు. అమ్మాయిలు ఎవరి మీదా ఆధారపడకుండా ముందుకెళ్లినప్పుడే ఆత్మనిర్భర్ భారత్ సాకారమవుతుందని పేర్కొన్నారు.

**ఇంజనీరింగ్ కీలకం**

మెడికల్, ఐటీ, కంప్యూటర్స్, డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌ఫోన్లు సహా అన్ని రంగాల్లోనూ ఇంజనీరింగ్‌ది కీలకపాత్ర అని ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము చెప్పారు. భవిష్యత్ టెక్నాలజీలు ప్రజలకు ఉపయోగపడేలా, పర్యావరణానికి మేలు చేసేలా ఉండాలని సూచించారు. కాప్ 27 సదస్సులో మన దేశం సేఫ్ ఎన్విరాన్మెంట్ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలంటూ తీర్మానం చేసిందని ఆమె గుర్తుచేశారు. అందులో భాగంగానే ఎలక్ట్రిక్ వెహికల్స్, పెట్రోల్‌లో ఇథనాల్ బ్లెండింగ్, గ్రీన్ హైడ్రోజన్, రెన్యువబుల్ ఎనర్జీ వంటి ఇనిషియేటివ్‌లను కేంద్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఎక్కువ మందికి ఉపయోగపడేలా టెక్నాలజీని అభివృద్ధి చేయాలని, మారుమూల ప్రాంతాల్లోని పేదలకూ టెక్నాలజీ సాయం అందాలని ముర్ము సూచించారు. టెక్నాలజీని సోషల్ జస్టిస్‌కు టూల్‌గా ఉపయోగించాలన్నారు. దేశంలో యూనివర్సల్ డిజిటల్ లిటరసీ గురించి ఇటీవల గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌తో చర్చించానని ముర్ము గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రపంచంలో ప్రజలంతా టెక్నాలజీని మును పెన్నడూ లేనివిధంగా వాడుకుంటున్నారని, కానీ, డిజిటల్ లిటరసీ ద్వారానే టెక్నాలజీని సరైన మార్గంలో వాడుకోగలుగుతామని ఆమె చెప్పారు.

**ఆడబిడ్డలకు అండగా ఉంటాం: కిషన్‌రెడ్డి**

ప్రతి రంగంలోనూ మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారు. "ప్రస్తుతం మన ఆర్థిక మంత్రి మహిళ. గతంలో డిఫెన్స్ మినిస్ట్రీ, విదేశాంగ శాఖ, లోక్‌సభను నడిపించింది మహిళలే. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంలో 20 మంది మహిళా మంత్రులున్నారు. రిపబ్లిక్ డే ఉత్సవాలకు ఆడబిడ్డలు నేతృత్వం వహిస్తున్నారు" అని ఆయన చెప్పారు. 50 డిగ్రీల ఎండ, మైనస్ డిగ్రీల చలైనా ఆడబిడ్డలు ఏకే 47లు పట్టుకుని పాకిస్తాన్, చైనా, బంగ్లాదేశ్ బార్డర్లలో దేశ రక్షణ కోసం సేవలందిస్తున్నారని తెలిపారు. ఏ కష్టమొచ్చినా ఆడబిడ్డలకు అండగా ఉంటామని కిషన్ రెడ్డి చెప్పారు.

**రీసెర్చ్, ఇన్నోవేషన్‌లో భాగమవ్వాలి: గవర్నర్**

ప్రతి మహిళా తమ హక్కుల కోసం గళం విప్పాలని ప్రెసిడెంట్ ముర్ము గట్టిగా కోరుకుంటారని గవర్నర్ తమిళిసై అన్నారు. గోల్డ్ మెడల్స్ సాధిస్తున్న వారిలో ఎక్కువగా అమ్మాయిలే ఉంటున్నారని, ఇటీవల చాలా కాన్వొకేషన్లకు వెళ్లినప్పుడు తాను ఈ విషయాన్ని గమనించానని ఆమె తెలిపారు. కానీ, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో 15 శాతం మంది అమ్మాయిలే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రీసెర్చ్, ఇన్నోవేషన్‌లో మహిళలు భాగమవ్వాలని పిలుపునిచ్చారు.

ఈనాడు
epaper.eenadu.net



# ఉద్యోగాల సృష్టికర్తలుగా మారండి

- శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే బలమైన ఆర్థిక వ్యవస్థ
- జీ నిట్స్ విద్యార్థినులతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు జ్ఞాపిక అందజేస్తున్న జీనిట్స్ ఛైర్మన్ పి.సుబ్బారెడ్డి. వేదికపై గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: "ఇంజినీరింగ్ చదువుతుంటున్న మీరంతా ఉద్యోగాల కోసం తాపత్రయపడకుండా ఉద్యోగాల సృష్టికర్తలుగా మారండి. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న పలు సమస్యలకు శాస్త్ర, సాంకేతిక రంగాలే పరిష్కారం చూపుతున్నాయి.. వాటితోనే బలమైన ఆర్థిక వ్యవస్థ ఏర్పడుతుంది.. అందుకే దేశాభివృద్ధిలో భాగస్వాములవడమే మీ లక్ష్యం కావాలి" అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని జి.నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ (జీనిట్స్) రజతోత్సవాలలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "పరిశోధనలతో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, ఇందులో యువ ఇంజినీర్ల పాత్ర ఎంతో ఉంది. ఈతరం యువతులు విద్య, ఉద్యోగం, కుటుంబం అన్న భావనను పక్కనపెట్టి వ్యాపారాలు నిర్వహించడం ద్వారా అణగారిన వర్గాలను పైకి తీసుకురావాలి. వినూత్న ఆలోచనలు, నవకల్పనలు మీకే సొంతం. కొత్త ఆలోచనలతో మీదైన ప్రపంచాన్ని సృష్టించండి. అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావడం కొంత కష్టమే... అందుకే పారిశ్రామికవేత్తలవ్వాలన్న ఆలోచనలకు పదును పెట్టండి. దేశంలో డిజిటల్ అక్షరాస్యత మరింత పెరగాల్సి ఉంది. అందుకు సహకారం అందించాలని ఇటీవల గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌ను కోరగా అంగీకరించారు. ప్రతి రాష్ట్రంలోనూ జిల్లాకొక అనాథ వసతిగృహం ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి" అని రాష్ట్రపతి అన్నారు. గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సత్యవతి, జీనిట్స్ ఛైర్మన్ పి.సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షురాలు జె.శ్రీవిద్యారెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ జె.రాఘవరెడ్డి, జీనిట్స్ అధ్యాపకులు, విద్యార్థినులు ఈ వేడుకలకు హాజరయ్యారు.

### పెళ్లి అవరోధం కాదు: గవర్నర్ తమిళిసై

విద్యార్థినుల్లో కొందరు తమ లక్ష్యాలు పూర్తి చేసుకోకుండా పెళ్లి చేసుకుంటే.. ముందుకు వెళ్లలేం అనుకుంటున్నారని, పెళ్లి వ్యక్తిగత, సమాజాభివృద్ధికి అవరోధం కాదని రాష్ట్ర గవర్నర్ తమిళిసై అన్నారు. యువతులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఎప్పుడూ కన్నీళ్లు పెట్టుకోవద్దని కోరారు.

### అప్పుడు దిగుమతులు..

### ఇప్పుడు ఎగుమతులు: కిషన్‌రెడ్డి

ఎనిమిదేళ్ల కిందట దేశంలో వినియోగించిన సెల్‌ఫోన్లలో 98 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నవే కాగా ప్రస్తుతం రూ.వేల కోట్ల విలువైన సెల్‌ఫోన్లను ఎగుమతి చేస్తున్నామని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఇదంతా మన ఇంజినీరింగ్ నైపుణ్యమేనన్నారు.

## రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించిన రాష్ట్రపతి కుటుంబ సభ్యులు



బాహుబలి సెట్ వద్ద అధికారుల బృందంతో రాష్ట్రపతి కుటుంబ సభ్యులు

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కుటుంబసభ్యులు గురువారం రామోజీ ఫిల్మ్‌సిటీని సందర్శించారు. అద్భుతంగా తీర్చిదిద్దిన ప్రిన్స్ స్ట్రీట్, యురేకా ప్రాంతం, బాహుబలి సినిమా చిత్రీకరణ జరిగిన మాహిష్మతీ సామ్రాజ్యం సెట్, పక్షుల పార్కు, భాగవతం సెట్, విమానాశ్రయం తదితరాలను పరిశీలించారు. వినోదాలతో పాటు సరికొత్త అనుభూతిని పంచే రామోజీ మూవీ మ్యాజిక్, స్పేస్ యాత్ర, ఫిల్మీదునియా, స్పిరిట్ ఆఫ్ రామోజీ షోలను తిలకించి ఆనందించారు. పలు లొకేషన్లలో రాష్ట్రపతి అల్లుడు గణేష్ చంద్ర హెంబ్రామ్, ఇతర కుటుంబ సభ్యులు, మనవరాళ్లు ఫొటోలు తీసుకున్నారు. లైజన్ ఆఫీసర్ రచన, ఇతర అధికారులు వారి బృందంలో ఉన్నారు.

### మళ్లీ మళ్లీ రావాలనిపించేలా ఉంది: గణేష్ చంద్ర హెంబ్రామ్

రామోజీ ఫిల్మ్‌సిటీ మళ్లీ మళ్లీ చూడాలనిపించేంత నచ్చిందని, ఏటా రావాలనిపించేంత బాగుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అల్లుడు గణేష్ చంద్ర హెంబ్రామ్ పేర్కొన్నారు. అందమైన గార్డెన్లు, బాహుబలి సెట్, పక్షుల పార్కు, వినోద కార్యక్రమాలు బాగున్నాయన్నారు.

Date : 30/12/2022 EditionName : GREATER HYDERABAD PageNo :